క్లుప్తంగా

25 వరకు పీజీ ప్రవేశాలకు గడువు

గంభీరావుపేట: గంభీరావుపేటలోని ప్రభుత్వ పీజీ కళాశాలలో ఎంకాం, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ విభాగాల్లో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశాలకు ఈనెల 25 తుది గడువు అని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. విజయలక్ష్మీ తెలిపారు. డిగ్రీ పూర్తిచేసి ఆసక్తిగల విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో కళాశాలలో సంప్రదించాలన్నారు. ప్రవేశాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదని తెలిపారు.

సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడిగా నాగరాజు



కోనరావుపేట: మండలంలోని సుద్దాల గ్రామానికి చెందిన ఎరవెల్లి నాగరాజు కమ్యూనిస్ట్ పార్టీ (ఎం) జిల్లా కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈనెల 19, 20తేదీల్లో జిల్లా కేంద్రంలోని బీవైనగర్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన పార్టీ జిల్లా మహాసభల్లో జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఘనంగా మత్స్యకార దినోత్సవం



వేములవాడఅర్బన్: వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం, నాంపల్లి ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మత్స్యకార వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ కులస్తుల జెండాను ఆవిష్కరించారు.

సీఎంకు ఫొటో బహూకరణ



ఎల్లారెడ్డిపేట: మండలంలోని గొల్లపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు గోగూరి చిన్న శ్రీనివాస్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిపై ఉన్న అభిమానంతో బతుకమ్మ పండుగ రోజున బతుకమ్మపై సీఎం చిత్రం వేసి పేర్చాడు. ఈ ఫొటోను ఫ్రేమ్ కట్టించి, వేములవాడకు బుధవారం వచ్చిన సీఎంను కలిసి బహూకరించాడు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మ హేందర్‌రెడ్డి, అడ్వకేట్ ఆంజనేయులు, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు సాహెబ్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డి సీఎంను కలిశారు.

అయ్యప్ప పూజ



ముస్తాబాద్: ముస్తాబాద్ మాజీ ఎంపీపీ జనగామ శరత్‌రావు గృహంలో అయ్యప్పస్వామి పూజ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. రాజుగురుస్వామి ఆధ్వర్యంలో గణపతి హోమం నిర్వహించి, అయ్యప్పస్వామికి అష్టాభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. వందలాది మంది అయ్యప్ప దీక్షాస్వాములు భజనల్లో పాల్గొన్నారు. అయ్యప్ప ఆలయ కమిటీచైర్మన్ చీటి జితేందర్ రావు, కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, సింగిల్‌విండో చైర్మన్ తన్నీరు బాపురావు, నాయకులు సురేందర్‌రావు, కొ ముృ బాలయ్య, విజయరామారావు, సత్తయ్య, సంతోష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఇల్లంతకుంట: మండలంలోని రేపాక గ్రామానికి చెందిన బొడిగ కిరణ్ (38) కొద్దిరోజుల క్రితం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం మల్లారం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లుండగా మాజీ ఎంపీటీసీ సుమలత మల్లేశం, పోతుగంటి రవి, గూడ బాబు, గౌడసంఘం సభ్యులు ప్రమాదానికి కారణమైన కారు యజమానిని ఆర్థికసాయం చేయాలని డిమాండ్ చేశారు. దీంతో మృతుడి ఇద్దరు కూతుళ్ల పేరిట కారు యజమాని రూ.3లక్షలు పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్ అందించినట్లు గ్రామస్తులు తెలిపారు.

నియామకం

గంభీరావుపేట: పద్మశాలీ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా గంభీరావుపేటకు చెందిన ఎల్లె బాలకృష్ణ నియమితులయ్యారు. ఈమే రకు రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు అందించా రు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరగాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌వో రజిత

సిరిసిల్ల: జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రిల్లోనే ప్రసవాలు జరగాలని, ఆ దిశగా గర్భిణులను చైతన్యవంతులను చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో రజిత కోరారు. చీర్లవంచ, విలాసాగర్ పీహెచ్‌సీలను గురువారం తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఆరోగ్య, ఉప ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే ఆశకార్యకర్తలు, ఏఎన్‌ఎంలు గర్భిణులను ఇంటింటి సర్వే ద్వారా గుర్తించాలన్నారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేయాలని సూచించారు. డాక్టర్లు అనిత, రామకృష్ణ, సీహెచ్‌వో సత్యనారాయణ, డీడీఎం కార్తీక్ పాల్గొన్నారు.



చీర్లవంచ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో రజిత

రూ.వెయ్యి కోట్లపై క్లారిటీ ఇవ్వండి

- బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేములవాడ: సీఎం రేవంత్‌రెడ్డి వేములవాడ పర్యటనలో రూ.వెయ్యి కోట్లతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేశామంటూ ప్రకటించిన వైనంపై స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రజలకు క్లారిటీ ఇవ్వాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు డిమాండ్ చేశారు. పట్టణంలోని తన నివాసంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్‌ను తిట్టడం, కొడంగల్ విషయాన్ని మాట్లాడడం తప్ప వేములవాడ ప్రాంత అవసరాలపై సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడలేదన్నారు. గత తొమ్మిదిన్నర ఏళ్లలో రాజన్నసిరిసిల్ల జిల్లా, వేములవాడ ప్రాంతం అభివృద్ధి కాలేదని చెప్పడం హాస్యాస్పదమన్నారు. ముఖ్యమంత్రి ప్రారంభించినవి, శంకుస్థాపన చేసిన వాటిల్లో బీఆర్‌ఎస్ హయాంలోనివేనని పేర్కొన్నారు. మిడ్‌మానేరును కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించి పూర్తి చేయలేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రాజెక్టును పూర్తి చేసిందన్నారు. ప్యాకేజీ 9 మరుగున పడిందని సీఎం స్థాయిలో మాట్లాడడం సరికాదని, రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.32 కోట్లు వెచ్చించి స్థలాన్ని సేకరించామని, రూ.70కోట్లతో కట్ట నిర్మించినట్లు వివరించారు. గుడి చెరువులో ఎల్లప్పుడు నీరు ఉండాలని మధ్యమానేరు నుంచి ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా పంపింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ధర్మంగుండంలోకి గోదావరి జలాలను నింపాలని రూ.5 కోట్లతో పైప్‌లైన్ వేశామన్నారు. బద్దిపోచమ్మ ఆలయ అభివృద్ధికి భక్తుల సౌకర్యం కోసం 39 గుంటల భూమిని సేకరించామని, ఇది ఆలయ అభివృద్ధిలో భాగం కాదా అని ప్రశ్నించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కౌన్సిలర్లు, జెడ్పీ మాజీ చైర్మన్లు తీగల రవీందర్‌గౌడ్, న్యాలకొండ అరుణ, నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, గంగం స్వరూప తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనర్సింహారావు

'సిరిసిల్లను అభివృద్ధి చేసింది ఎమ్మెల్యే కేటీఆరే'

సిరిసిల్లటౌన్: సిరిసిల్లను అభివృద్ధి చేసింది ఎమ్మెల్యే కేటీఆరే అని బీఆర్‌ఎస్ యూత్ వింగ్ అధ్యక్షుడు సుంకపాక మనోజ్‌కుమార్ అన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నిన్న మొన్నటి వరకు బీఆర్‌ఎస్ పార్టీలో ఉండి పదవులు చేపట్టినవారు ఇప్పుడు స్వార్థ రాజకీయంతో కాంగ్రెస్‌లో చేరి బీఆర్‌ఎస్, కేటీఆర్‌పై అసత్యారోపణలు చేయడం శోచనీయమని, వ్యాఖ్యలు మానుకోవాలని హితవు పలికా రు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో సిరిసిల్ల నేతన్నలు, వస్త్ర పరిశ్రమకు ఎంతో చేసిందన్నారు. కేటీఆర్‌పై ఇష్టానుసారంగా మాట్లాడితే సహించబోమని హెచ్చరించారు. నాయకులు రాజు, మన్సూర్, ఇమ్రాన్, పవన్, బిట్టు తదితరులు పాల్గొన్నారు.

సీఎం వస్తే పాఠశాలలు బంద్ చేయడం సరికాదు

వేములవాడఅర్బన్: వేములవాడకు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా ప్రైవేటు పాఠశాలలకు సెలవుల ప్రకటించడం సరికాదని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ అధ్యక్షుడు సామల్ల సాయి భరత్ అన్నారు. గురువారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) వేములవాడ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం విద్యార్థుల సమస్యల గురించి మాట్లాడలేదని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్‌లను విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కడారి శివ, సాయి కుమార్, విజేంద్ర, సాయి, శివ తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

చందుర్తి: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గురువారం చందుర్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి డిప్యూటీ తహసీల్దార్ శ్రీలతకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ప్రతినెలా కార్మికులకు రూ.10వేల వేతనం, పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. లేకపోతే డిసెంబర్ 10,11 తేదీల్లో టోకెన్ సమ్మెకు దిగుతామన్నారు. 60 ఏళ్లు నిండిన కార్మికులకు ప్రతీనెల రూ.10వేల పింఛన్ అందించాలని, అలాగే రిటైర్మెంట్ బెనిఫిట్‌గా రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. ఇక్కడ కార్మికులు మర్రి విజయ, చిలుక లక్ష్మీ, లింగంపల్లి లోత్కు, పద్మ, భాగ్య, రజిత, రేణుక, సత్తయ్య, విజయ తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ఉరేసుకొని వ్యక్తి మృతి

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లిలో మానుపాటి చంద్రయ్య (55) ఇంట్లో గురువారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... చంద్రయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, గతంలోనూ ఆత్మహత్యా యత్నానికి యత్నించినట్లు తెలిపారు. అనారోగ్యంతోనే ఉరేసుకొని మృతిచెందినట్లు పేర్కొన్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా మృతికి గల కారణాలు తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారులు రాజు, శేఖర్, కూతురు రాజమణి ఉన్నారు.

కార్మికుల సమస్యలపై పోరాడుతాం

సిరిసిల్లటౌన్: నేత కార్మికులకు ప్రత్యేక పథకాలు అందిస్తారన్న ఆశలపై సీఎం రేవంత్‌రెడ్డి నీళ్లు చల్లారని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వేములవాడకు వచ్చిన సీఎం సిరిసిల్ల నేతన్నల ఆత్మహత్యలు నివారణ, పరిశ్రమ మనుగడపై స్పష్టమైన ప్రకటనలు ఏవి చేయక పోవడం విచారకరమన్నారు. కార్మికుల సమస్యలను పోరాడి పరిష్కరించుకుంటామన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధికి పార్టీ ప్రణాళికతో ముందుకు వెళ్తుందన్నారు. జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన వసతులు కల్పించాలని కోరారు. మిషన్ భగీరథ నీరు కాకుండా సిరిసిల్ల మానేరు నీటిని సప్లై చేయాలని, జీపీల్లో మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఇటీవల రెండ్రోజుల పాటు జరిగిన సీపీఎం జిల్లా మహాసభల్లో 24 ప్రజా సమస్యలపై తీర్మానాలు చేశామన్నారు. 14 మందితో పార్టీ జిల్లా కమిటీ ఎన్నికైందని, 5గురితో కార్యదర్శి వర్గం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు ఎగమంటి ఎల్లారెడ్డి, జువ్వాజి విమల, కోడం రమణ, మల్లారపు వరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మూశం రమేశ్

విద్యుత్ వైర్ల నుంచి మంటలు



విద్యుత్ వైర్లను సరిచేస్తున్న రైతులు

వీర్నపల్లి: మండలంలోని అడవిపదిరలో ఓ రైతు పొలంలో ఒక్కసారిగా విద్యుత్ వైర్లనుంచి మంటలు చెలరేగాయి. దీంతో పశుగ్రాసం దగ్ధంకాగా రైతులు సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు నిర్లక్ష్యంగా ప్రవర్తించడంతో రైతులే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆఫ్ చేసి విద్యుత్ వైర్లను సరిచేశారు. లూజ్‌వైర్లు వేలాడుతున్నాయని, సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. సమాచారం అందించినా విద్యుత్ సమస్యను పట్టించుకోని అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్ చేస్తున్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న అంగూరి రంజిత్

సిరిసిల్లటౌన్: గతంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ తప్పిదాలను ప్రస్తుత అధికార పార్టీ కాంగ్రెస్ పాటిస్తుందని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి అంగూరి రంజిత్ విమర్శించారు. గురువారం సిరిసిల్లలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఫీజు బకాయిలను చెల్లించని సర్కారు విద్యార్థులను అక్రమ అరెస్టులు చేస్తుందని దుయ్యబట్టారు. విద్యారంగ పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉసిరి చెట్ల కింద సత్యనారాయణ స్వామి వ్రతం



వీర్నపల్లి: కార్తీక మాసం సందర్భంగా మండలకేంద్రంలో వైశ్యులు గురువారం సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఉసిరి చెట్ల వద్దకు పిల్లపాపలతో వచ్చి చెట్లకింద పూజలు నిర్వహించి అనంతరం వన భోజనాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మండలంలోని గ్రామ ప్రజలు, వైశ్య కుటుంబాలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు పూర్తి

సిరిసిల్ల ఎడ్యుకేషన్: మండలంలోని గండిలచ్చపేటలో ప్యాక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు పూర్తయింది. ఈ సందర్భంగా ప్యాక్స్ చైర్మన్ బండి దేవదాసు సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో ప్యాక్స్ డైరెక్టర్ బండి దేవేందర్ యాదవ్, సీవో నరేశ్, కంకణాల దేవరాజు, రైతులు, హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన నాయకులు

వేములవాడఅర్బన్: వేములవాడ నుంచి వెళ్తున్న ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు కలిశారు. వేములవాడ నందికమాన్ వద్ద కలిసి శాలువతో సన్మానించారు.

● టెలివిజన్ డే వేడుకలు

సిరిసిల్లటౌన్: వరల్డ్ టెలివిజన్ డే వేడుకలను జిల్లా టీవీ మెకానిక్‌ల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం సిరిసిల్ల సాయినగర్‌లో జరిగిన కార్యక్రమంలో కేక్‌కోసి స్వీట్లు పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు కుసుమ హేమంత్, ప్రధాన కార్యదర్శి జక్కని సుధాకర్, ఉపాధ్యక్షుడు ఎనగందుల రమేశ్, బాలరాజు, కోశాధికారి ఇప్పనపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

● వాహనం ఢీకొని పశువులు మృత్యువాత

సిరిసిల్లటౌన్: జిల్లాకేంద్రంలోని బైపాస్ రోడ్డులో గురువారం గుర్తు తెలియని వాహనం ఢీకొని రెండు పశువులు మృతిచెందాయి. రిజిస్ట్రేషన్ ఆఫీస్ సమీపంలో జరిగిన సంఘటనలో దుమాల రంజిత్ అనే రైతుకు చెందిన పాడి పశువులు మృతిచెందా యి. రూ.2లక్షల నష్టంతో పాటు జీవనోపాధి కోల్పోయామని ప్రభుత్వం ఆదుకోవాలని రంజిత్ కోరాడు.

● నోట్‌బుక్స్ పంపిణీ

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో జంగ శ్రీనివాస్ జ్ఞాపకార్థం అతని తల్లిదండ్రులు నాంపెల్లి, సౌందర్య గురువారం పాఠశాలలో బుక్స్, స్వీట్లు పంపిణీ చేశారు. ఇక్కడ హెచ్‌ఎం రాధాకిషన్‌రావు, కాంగ్రెస్ ఎస్‌ఆర్‌ఐ సెల్ జిల్లా అధ్యక్షుడు ధర్మేందర్, జంగ కృష్ణ పాల్గొన్నారు.

● మహాసభను విజయవంతం చేయాలి

చందుర్తి: పట్టణంలో ఈనెల 24న తలపెట్టిన బీడీ కార్మికుల రెండో మహాసభను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కదారి రాములు కోరారు. మండలకేంద్రంలో బీడీ కార్మికుల మహాసభ కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలో మహాసభ సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి కార్మికుల భవనం వరకు 24న ర్యాలీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో వేణు, అజ్జు, అనసూయ, వినోద్, తులసవ్వ, చింతం భూదవ్వ, కల్లెడ లక్ష్మీ, పల్లికొండ లక్ష్మీ, లలిత తదితరులు పాల్గొన్నారు.

● విద్యార్థులకు డైరీలు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని అంబేడ్కర్‌నగర్ ప్రభుత్వ మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు గురువారం రాజేశ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డైరీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డైరీలు అందించిన ఫౌండేషన్ చైర్మన్ రాజేశ్‌కు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు ఏర్పుల హన్మయ్య, అంతడుపుల ఎల్లయ్య, బాబు, శ్రీనివాస్, నర్సింలు, భాగ్యలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌యి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

గంభీరావుపేట: సముద్రలింగాపూర్‌లో పలువురికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పూజం భూమరాజం, ఎర్ర కిషన్‌గౌడ్, సంతోష్, రామాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



బోయినపల్లి: బోయినపల్లి నుంచి కొదురుపాక వెళ్లే రోడ్డులో పెట్రోల్ బంక్ వద్ద రోడ్డు మధ్యలో కంకర తేలడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. పలుసార్లు ఇక్కడ ప్రమాదాలు జరిగాయి. అయినా అధికారులు రోడ్డు మరమ్మతు పనులు చేపట్టడం లేదు. వెంటనే రోడ్డు మరమ్మతు పనులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చూడాలి.
–నిమ్మ శ్రీనివాసరెడ్డి, దేశాయిపల్లి, బోయినపల్లి

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
శాంతయ్య, ఆర్అండ్‌బీ డీఈఈ, వేములవాడ, సెల్ నంబర్ 9440818424

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

అన్ని రంగాల్లో నియోజకవర్గ అభివృద్ధి

వేములవాడ : వేములవాడ నియోజకవర్గానికి రూ.వెయ్యి కోట్ల నిధులను కేటాయించడంతో వేములవాడ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లలో బీఆర్‌ఎస్ చేయని పనులు కాంగ్రెస్ ప్రభుత్వం పది నెలల్లో చేస్తోందని, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారన్నారు. వేములవాడలో జరిగిన సీఎం సభను సక్సెస్ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో పట్టణ ప్రధాన కార్యదర్శి కనికరపు రాకేశ్, నాయకులు చిలుక రమేశ్, కూరగాయల కొమురయ్య, అన్నారం శ్రీనివాస్, పులి రాంబాబుగౌడ్, రజాక్, గణేశ్, తోట రాజు, కృష్ణ, ఖమ్మం గణేశ్, తోట లహరి, కుతాటి రాజేశం, కొక్కుల రాజు, నాగుల మహేశ్, పోతుగంటి వెంకన్న, మర్రిపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి



ముస్తాబాద్‌లో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు



బోయినపల్లి: ప్రశంసాపత్రాలతో విజేతలు



రుద్రంగి: విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో వేములవాడ అర్బన్, వేములవాడ రూరల్ మండలస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు గుర్రం అంజయ్య మాట్లాడుతూ సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి బన్నాజీ, తదితరులు ఉన్నారు.

సిరిసిల్లఎడ్యుకేషన్: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం సిరిసిల్లలో చెకుముకి మండల స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. మండలంలోని పది పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి మార్వాడి గంగరాజు, ఎంఈవో దూస రఘుపతి,

ముస్తాబాద్: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత బాలుర పాఠశాలలో చెకుముకి ప్రతిభా పరీక్షను నిర్వహించారు. ఇందులో నామాపూర్ జెడ్పీ పాఠశాల, బాలుర గురుకుల పాఠశాల నుంచి 9 మంది విద్యార్థులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు సైన్స్ టీచర్లు ఆనందం, వెంకట రామారావు, రవీందర్, రాజిరెడ్డి పేర్కొన్నారు.

గంభీరావుపేట: చెకుముకి మండలస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను మండలకేంద్రంలోని కేజీ టు పీజీ ప్రాంగణంలో నిర్వహించారు. జెడ్పీ పాఠశాలల విభాగం నుంచి ముచ్చర్ల విద్యార్థులు, ప్రైవేట్ పాఠశాలల విభాగం నుంచి ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్ విద్యార్థులు, రెసిడెన్షియల్ విభాగం నుంచి దమ్మన్నపేట మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఎంఈఓ గంగారం, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో చెకుముకి ప్రతిభ పరీక్ష నిర్వహించారు. వివేకానంద ఇంగ్లిష్ మీడియం స్కూల్ (పొత్తూరు), జెడ్పీ ఉన్నత పాఠశాల (ఇల్లంతకుంట), రహీంఖాన్‌పేట మోడల్ స్కూల్ విద్యార్థులకు మొదటి బహుమతిని అందించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీహరి, మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్, పావని, తిరుపతి పాల్గొన్నారు.

బోయినపల్లి: వెంకట్రావుపల్లి హైస్కూల్‌లో నిర్వహించిన చెకుముకి సైన్స్ పోటీల విజేతలకు జనవిజ్ఞాన వేదిక ఉమ్మడి జిల్లా వ్యవస్థాపకుడు సి. రామరాజు, తదితరులు ప్రశంసాపత్రాలతో పాటు బహుమతులు అందించారు. ఎంఈవో శ్రవణ్‌కుమార్, కన్వీనర్ నర్సయ్య తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలస్థాయి సైన్స్ చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను మండల కేంద్రంలోని హైస్కూల్‌లో నిర్వహించారు. ఎంఈవో కృష్ణహరి, హెచ్‌ఎం మనోహర్‌చారి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో తిమ్మాపూర్ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం, ప్రైవేట్ విభాగంలో జ్ఞానదీప్ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గోల్కొండ శ్రీధర్, జిల్లా కార్యదర్శి సునీత, తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మండలస్థాయి చెకుముకి ప్రతిభ పరీక్షలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన ఆదర్శ పాఠశాల, వీర్నపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. జన విజ్ఞాన వేదికజిల్లా కార్యదర్శిరమేశ్, తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన మండలస్థాస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ పోటీల్లో కేరళ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. విద్యార్థులను కేరళ గ్లోబల్ హైస్కూల్ కరస్పాండెంట్ బాబు నంబీయార్, ప్రిన్సిపాల్ లతిక అభినందించారు.

సంక్షేమ పథకాలపై కళాజాత

సిరిసిల్ల ఎడ్యుకేషన్: కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, ప్రజాపాలనపై సాంస్కృతిక శాఖ కళాకారుఉలు గురువారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో కళాప్రదర్శన చేశారు. పరిసరాల శుభ్రత పాటించాలని, ప్రభుత్వం చేపడుతు న్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూ చించారు. కార్యక్రమంలో కళాకారులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

● పశు వైద్యశిబిరం

సిరిసిల్ల ఎడ్యుకేషన్: తంగళ్లపల్లి మండలం దేశాయిపల్లిలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం గురువారం నిర్వహించారు. పశు వైద్యసిబ్బంది పశువులకు టీకాలు వే శా రు. మండల పశు వైద్యాధికారి అంజి రెడ్డి, గోపాల్ మిత్ర సూపర్‌వైజర్ వెద్య సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా :
9951602934, 9010610963
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
సిరిసిల్ల : రఘు - 7331119957
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899